
సాక్షి ఒడిశా

గురువారం । 16 । జనవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,61,721లు, బంగారం 8గ్రాముల 250 మిల్లీగ్రాములు, వెండి 123 గ్రాముల 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



తగ్గిన మొసళ్ల సంతతి

మొసళ్ల సంతతి వృద్ధి, సంరక్షణ కార్యకలాపాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వీటి సంతతి తగ్గినట్లు తాజా లెక్కింపు నివేదిక వెల్లడించడం ఆందోళన కలిగిస్తోంది.

- 8లో.



పెన్షన్ పెంపు..ఆనందం రెట్టింపు

రాష్ట్రంలో 80 ఏళ్లు పైబడిన వయోవృద్ధులు, 80 శాతం అంత కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు పెన్షన్ పెంచే కార్యక్రమం బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది.

- 8లో.

న్యూస్‌రీల్

పేదలకు దుస్తులు పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక

రాయగడ: స్థానిక ఎంఎల్ఏ అప్పల స్వామి కద్రక అంబాగుడలోని తన స్వగృహం వద్ద సంక్రాతిని పురస్కరించుకుని పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ఏటా ఈ తరహా సేవా కార్యక్రమాలను నిర్వహింటారు. అయితే ఈసారి ఎమ్మెల్యే హోదాలో ఈ కార్యక్రమం చేపట్టారు. అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 350 మంది మహిళలు, రెండు వందల మంది పురుషులకు దుస్తులు అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

బోల్తా పడిన ఇసుక లారీ



బోల్తాపడిన లారీ

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి జమ్ముగుడ వద్ద ఇసుక లారీ బోల్తా పడింది. మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇసుక లోడ్‌తో టికిరి నుంచి శంకరాడ వెళ్తున్న లారీ అదుపు తప్పడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవరు సురక్షితంగా బయట పడ్డాడు. అక్కడ ఉన్న స్థానికులు లారీలో ఇరుక్కపాయిన డ్రైవరును బయటకు తీయడంతో ప్రమాదం తప్పింది. అధికవేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

రద్దీగా మాంసాహార మార్కెట్లు



చేపల మార్కెట్‌లో కొనుగోలుదారులు

రాయగడ: కనుమ పండగ సందర్భంగా బుధవారం రాయగడ మెయిన్ మార్కెట్ కిటకిటలాడింది మాంసం, చేపలు కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున జనం రావడంతో ప్రధాన రహదారి రద్దీగా కనిపించింది.

ప్రత్యేక అలంకరణలో బలభద్ర, సుభద్రలు



ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

జయపురం: జయపురంలోని జగన్నాథ మందిరంలో దేవతా మూర్తులు శ్రీజగన్నాథ, బలభద్ర, సుభద్రలను మకర చుడా వేశంలో అలంకరించి అన్న భోగతంలో పూజలు చేశారు. మందిర పూజారి వైదిక నీతి నియమాలతో శ్రీజగన్నాథ, దేవతా మూర్తులకు పూజలు నిర్వహించారు. అలాగే ఆ ప్రాంతంలో మరో ఆలయంలో ఉన్న వల్లభ నారాయణకు కూడా మకర సంక్రాంతి సందర్భంగా అందంగా అలంకరించారు. ఖందర సాహిలోని లక్ష్మీ నరసింహ మందిరంలో నరసింహ స్వామిని అర్చకులు ప్రత్యేకంగా అలంరించారు. పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మంత్రికి ఉపాధ్యాయుల వినతి



మంత్రి నిత్యానంద గోండుకు వినతి పత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

జయపురం: పర్మినెంట్ ఉపాధ్యాయులకు లభిస్తున్న సౌకర్యాలు తమకు కూడా వర్తింపచేయాలని బొరిగుమ్మ సమితి నాన్ పర్మినెంట్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన బొరిగుమ్మలోని సరస్వతీ శిశుమందిరం వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర విద్యాలయ, గణశిక్షా మంత్రి నిత్యానంద గోండ్‌ను కలిసి నాన్ పర్మినెంట్ ఉపాధ్యాయ సంఘం తరపున వినతిపత్రాన్ని సమర్పించారు. సంఘ బొయిపరిగుడ శాఖ అధ్యక్షులు అజిత్‌హోత్ర, ఉపాధ్యక్షులు సూర్యనారాయణ రాయ్, కోశాధికారి పద్మిణీ కుమార్ పండ, ఉపాధ్యాయురాలు సుస్మిత కుమారిపండ, నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సమన్వయ కమిటీ సలహాదారు బృంధావణ పండ, మహేశ్వర తండి ఉన్నారు.

సంప్రదాయాల సంక్రాంతి



పర్లాకిమిడి: స్థానిక కళాకారుల నృత్యం



పర్లాకిమిడి: డ్యాన్స్ మాస్టర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



పర్లాకిమిడి: మకర సంక్రాంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

రాయగడ:

సంక్రాంతి పండగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. సంప్రదాయబద్ధంగా పెద్దలకు నివేదన చేశారు. ముత్తయిదువులకు ఫల తాంబూళాలు అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. రాయగడ పట్టణంలో సంక్రాంతి పండగ ఉట్టిపడింది.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

పర్లాకిమిడి: మకర సంక్రాంతి సందర్భంగా పరలా కళా సంస్కృతి ఆధ్వర్యంలో స్థానిక రాంనగర్‌లో హైటెక్ ప్లాజా సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి వేడుకలను ప్రారంభించగా హైటెక్ మెడికల్ విద్యాసంస్థల చైర్మన్ డా.తిరుపతి పాణిగ్రాహి, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు, విశ్రాంత ఉపాధ్యాయులు గౌరచంద్ర పండా తదితరులు పాల్గొన్నారు. స్థానిక కళాకారులతో పాటు, విశాఖపట్నం, భువనేశ్వర్ నుంచి కళాకారులు విచ్చేసి అబ్బురపరిచే ప్రదర్శనలు ఇచ్చా రు. ముక్కనుమ వరకు వేడుకలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.



రాయగడ: ముత్తయిదువుల ఆశీర్వాదం తీసుకుంటున్న మహిళలు



పర్లాకిమిడి: మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ కళాకారుల ప్రదర్శన



పర్లాకిమిడి: ప్రేక్షకులను ఉర్రూతలూగించిన స్థానిక కళాకారులు



పర్లాకిమిడి: ఆకట్టుకున్న డ్యాన్సులు



పర్లాకిమిడి: విఘ్నేశ్వరుడి గీతానికి నృత్య రూపకం



రాయగడ: ఫల తాంబూలాలు

వైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక గోపూజలు



గోవుకు పూజిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో పవిత్ర సంక్రాంతి పర్వదినాల్లో భాగంగా కనుమ రోజైన బుధవారం నాడు సంఘం కార్యాలయం ప్రాంగణంలో సామూహిక గోపూజ కార్యక్రమాలు అత్యంత ఘనంగా జరిగాయి. సంఘం అధ్యక్షులు కింతలి అమర్‌నాథ్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అధికసంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. ప్రముఖ అర్చకులు గణపతి శాస్త్రి మంత్రోచ్ఛరణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోవులకు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం వాటికి బెల్లం, పచ్చగడ్డి, కూరగాయలను ఆహారంగా తినిపించారు. అలాగే కొత్త వస్త్రాలను గోవులపై వేసి పూజించారు. సంక్రాంతి పండుగ మూడో రోజున కనుమకు ప్రత్యేకత ఉందని.. సకల దేవతా స్వరూపమైన గోమాత అనుగ్రహం, ధర్మానికి ప్రతిరూపమైన వృషభం అనుగ్రహాలను భక్తులు పొందాలన్న ఉద్దేశంతో గోపూజలను నిర్వహించామని ఈ సందర్భంగా అమర్‌నాథ్ వివరించారు. సకల దేవతా స్వరూపమైన గోమాతకు ఆహారం తినిపించడం, నమస్కరించడం, గోవుతోకకు ప్రణమిల్లి ఆశీర్వాదం తీసుకోవడం ద్వారా సకల శుభాలు కలుగుతాయని అన్నారు. కార్యక్రమంలో స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు గుడ్ల గౌరి ప్రసాద్, అప్పల రాజు పాల్గొన్నారు.

కలప దుంగలు స్వాధీనం



కలప దుంగలు, నిందితులతో పోలీసులు సిబ్బంది

- ఇద్దరి అరెస్టు

రాయగడ: రాయగడ అటవీ శాఖ పరిధిలోని టికిరి రేంజ్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక పికప్ వ్యాన్‌లో కలప దుంగలను రవాణా చేస్తున్న ఇద్దరిని అటవీ శాఖ సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. పికప్ వ్యాతో సహా విలువైన 60 కలప దుంగలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి అరెస్టయిన వారిలో ఖురిగా గ్రామానికి చెందిన పింటు జొడియా, అమరసింహగుడ గ్రామానికి చెందిన గురుబార్ నాయక్‌లు ఉన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచినట్టు రేంజర్ అనిల్ కుమార్ పాణిగ్రాహి తెలిపారు. లెల్లిగుమ సంరక్షిత అడవుల నుంచి విలువైన వృక్షాలను నరికివేసి వాటిని అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పెట్రోలింగ్ బృందం ఈ మేరకు దాడులను నిర్వహించింది. నిందితుల నుంచిస్వాధీనం చేసుకున్న కలప విలువ సమారు 70 వేల రూపాయలు ఉంటుందని అంచనా. ఇద్దరి అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

విద్యార్థులకు పాల కానుక

భువనేశ్వర్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తరహాలో పాల కానుక వర్తింపజేయనున్నారు. విద్యార్థుల్లో ఆహార పోషక విలువలు పెంచేందుకు మెనూలో అదనంగా పాలు జోడిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సరికొత్తగా ఈ కార్యక్రమం చేపట్టనుంది. ఈ మేరకు మధ్యాహ్న భోజనంలో త్వరలో పాలు జోడించనున్నట్లు మత్స్య, పశు వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గోకులానంద మల్లిక్ బుధవారం ప్రకటించారు. ప్రతి విద్యార్థికి రోజువారీ భోజనంతో పాటు విటమిన్-ఎ, విటమిన్-డితో కూడిన 200 మిల్లీ లీటర్ల పాలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా మయూర్ భంజ్ జిల్లా రాయరంగ్‌పూర్ ప్రాంతంలోని 29 పాఠశాలల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. 1,184 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 200 మిల్లీ లీటర్ల చొప్పున పాలను అందజేస్తున్నట్లు వివరించారు. భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు కార్యక్రమాన్ని విస్తరిస్తారని మంత్రి గోకులానంద మల్లిక్ తెలిపారు.

రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం అమలు

భువనేశ్వర్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) అమలు చేయనున్నట్టు పాఠశాల, సామూహిక విద్యా విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. అమలు ప్రక్రియను పర్యవేక్షించడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు, ఆరో సబ్ కమిటీల సమన్వయంతో సిఫార్సులను రూపొందిస్తారు. ఈ కమిటీలు వివిధ వాటాదారుల నుంచి అనుబంధ సమాచారం అనుసంధానంతో ఈ ప్రక్రియ కొనసాగిస్తుంది. జాతీయ విద్యా విధానం పటిష్టంగా అమలు చేసేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుంది. భారత దేశం అంతటా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకు రావడం జాతీయ విద్యా విధానం లక్ష్యం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసే ఉద్దేశంతో భారత ప్రభుత్వం జారీ చేసిన జాతీయ విద్యా విధానం 2020ను రాష్ట్రంలో కూడా అమలు చేయాలని నిర్ణయించినట్లు ప్రకటించారు.

సంక్షిప్తంగా జాతీయ విద్యా విధానం

జాతీయ విద్యా విధానం అమలుతో రాష్ట్రంలో 5+3+3+4 పాఠశాల, నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేషన్ విద్యా విధానం ప్రవేశ పెడతారు. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న 10+2 వ్యవస్థ 5+3+3+4 విధానానికి మార్పు చేయబడుతుంది. ఉన్నత విద్యా రంగంలో మల్టీ డిసిప్లినరీ విద్యాభ్యాసం, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్/మాస్టర్స్, 3, 4 సంవత్సరాల అండర్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమం, 1, 2 ఏళ్ల పోస్ట్ గ్రాడ్యుయేషన్ అమలు అవుతాయి.

నేడు పీఎఫ్ కార్యాలయం ముట్టడి



బరంపురం బయలుదేరిన పేపరుమిల్లు కార్మిక నేతలు

జయపురం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని స్థానిక గగణాపూర్ సేవా పేపరుమిల్లు కార్మికులు, కంట్రాక్ట్ కార్మికులు కోరుతున్నారు. ప్రధానంగా పీఎఫ్ సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా బరంపురం పీఎఫ్ కమిషనర్ కార్యాలయాన్ని ఈ నెల 16వ తేదీన ముట్టడించనున్నారు. ఇందుకోసం బుధవారం సాయంత్రం పేపరుమిల్లు కార్మిక సంఘాల ప్రతినిధులు బరంపురం బయలుదేరి వెళ్లారు. ప్రముఖ కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి నేతృత్వంలో కార్మిక నేతలు బసంత బెహర, సరోజ్ పండ, సుభాష్ బెహర, ఉమాశంకర శతపతి, కె.సత్యనారాయణ, సుధాకర హరిజన్, ప్రహ్లాద మల్లిక్, కె.హనుమంతరావు తదితరులు ఎర్ర జెండాలు చేత బట్టి బరంపురం బయలుదేరారు.

ఆనందోత్సాహాలతో సీతకొండ జాతర



సీతకొండపై ఆంజనేయుడిని దర్శించుకుంటున్న భక్తులు



గుసాని సమితి సరియాపల్లి ప్రాంతంలో సీతకొండపైకి చేరుకుంటున్న ప్రజలు

పర్లాకిమిడి: గుసాని సమితి సరియాపల్లి పంచాయతీ పరిధిలోని సీతకొండపై బుధవారం కనుమ సందర్భంగా జాతర నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రజలు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. త్రేతాయుగంలో సీతారాముల వనవాసంలో భాగంగా ఈ కొండపైనే స్నానమాచరించినట్టు స్థలపురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ కొండను సీతకొండగా పిలుస్తారు. ఏడాదికి ఒకసారి మాత్రమే జరిగే ఈ వేడుక కోసం కిలోమీటరున్నర నడిచి కొండపైకి చేరుకోవాలి. అక్కడ ఇటీవల ఆంజనేయ స్వామి మందిరం కూడా విశ్వహిందూపరిషత్ నాయకులు నిర్మించారు. ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్‌లకు చెందిన పాత మిత్రులు ఈ కొండపైకి వచ్చి కలుసుకుంటారు. ఇక్కడ స్నేహం ఏర్పడితే మరుజన్మలోనూ కొనసాగుతుందని నమ్మకం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా మందస నుంచి గోప్పిలి మీదుగా ఈ కొండపైకి అధిక సంఖ్యలో జనం తరలివస్తారు.

సౌకర్యాల కల్పన..

సీతకొండ జాతరకు వచ్చే భక్తుల కోసం ఒడిశా అధికారులు తాగునీరు, విద్యుత్, బస్సు సౌకర్యాలను కల్పించారు. గ్రామీణ అమె బస్సులతో పాటు ప్రైవేటు ట్రావెల్స్ వాహనాలు పర్లాకిమిడి, మందస, గొప్పిలి, పలాస మీదుగా బస్సులు నడుపుతున్నారు. మోహనా, రాయఘడ బ్లాక్ నుంచి విచ్చేసే భక్తులకు విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు సహాయ సహకారాలు అందించినట్టు వీహెచ్‌పీ నాయకులు కైలాష్ గాడో తెలిపారు.

న్యూస్‌రీల్

నవోదయ పరీక్షకు 32 కేంద్రాలు

పరుబుజ్జిలి: వెన్నెలవలస వద్ద జవహర్ నవోదయ విద్యాలయంలో 2025 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 18న నిర్వహించనున్న ప్రవేశపరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8290 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడంతో 32 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు వివరించారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు గంట ముందు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్ష నిర్వహణకు 32 మంది సూపరింటెండెంట్లు, 17 మంది సీఎ లీఓలు, 15 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించినట్లు వివరించారు.

ఆదిత్యునికి అభిషేక సేవ



పూజలు చేస్తున్న శంకరశర్మ బృందం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మకర సంక్రాంతి సందర్భంగా క్షీరాభిషేకం, పంచామృతాలతో అభిషేకం చేశారు. గర్భాలయంలోని స్వామి మూలవిరాట్టుకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించడంతో పాటు నిజరూప దర్శనం కలగడంతో స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సాయంత్రం ఉషా పద్మిని ఛాయా దేవేరులతో ఆదిత్యుని ఉత్సవమూర్తులతో తిరువీధి నిర్వహించారు. అనంతరం అనివెట్టి మండపంలో వెండి సప్తాశ్వ రథంలో ప్రత్యేక పూజలు చేశారు. ధర్మపథంలో భాగంగా ఆలయ ఆస్థాన నాదస్వర బృందంతో సంగీత కచేరి నిర్వహించారు. ఆలయ ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ప్రసాదాల నివేదన చేపట్టారు.

నంది వాహనంపై నాగాభరణుడు



తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

జలుమూరు: కనుమ పండగ సందర్భంగా ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మధుకేశ్వరుడిని బుధవారం రాత్రి నంది వాహనంపై కొలువుదీర్చి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వరులకును అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లగా భక్తులు పెద్ద ఎత్తున హారతులిచ్చారు. సాధారణంగా స్వామివారి తిరువీధిని ఆలయ మాడవీధులకు పరిమితం చేస్తుంటారు. కానీ కనుమ నాడు మాత్రం నగిరి కటకం వరకూ పార్వతీ పరమేశ్వరుల తిరువీధిని నిర్వహించడం ఆనవాయితీ. కార్యక్రమంలో ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్దానంలో నేస్తరికం సందడి



నేస్తం ఇంట్లో భోజనం చేస్తున్న సన్యాసిరావు దంపతులు

కాశీబుగ్గ: ఉద్దానం మారుమూల గ్రామాల్లో నేస్తరికం సందడి నెలకొంది. గిరిజనులు కనుమనాడు మిత్తనోరు ఇళ్లకు వెళ్లి భోజనం చేశాక తాము పండించిన పంటలను అందిస్తున్నారు. తిరిగి వచ్చేటప్పుడు వారు అందించే వస్త్రాలను స్వీకరిస్తున్నారు. బుధవారం మందస మండలం సందూరు గ్రామంలో దాసరి వాసుదేవ రావు ఇరవై ఏళ్ల క్రితం మరణించినా.. వారి నేస్తం సవర సన్యాసిరావు సంతలక్ష్మీపురం నుంచి భార్యతో కలిసి వచ్చి ఆతిథ్యం స్వీకరించారు.

కనుమ నాడు భోగి మంట



మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామంలో బుధవారం కనుమ పండగ నాడు భోగి పండగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఇక్కడ చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్నందున భోగి రోజు వరకు నేత వస్త్రాలు పనిలో బిజీగా ఉంటారు. అందుకే ఆ రోజు భోగి మంట వేయరు. సంక్రాంతి పండగ మరునాడు భోగీ మంట వెలిగించడం సంప్రదాయంగా వస్తోందని గ్రామానికి చెందిన బొచ్చు మోహనరావు, బొమ్మన వీరబద్రరావు, సురేష్ కుమార్ తెలిపారు.

విజయ గణపతికి అష్టోత్తర శత దీపారాధన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతి దేవాలయంలో స్వామికి కనుమ పండుగ సందర్భంగా అష్టోత్తర శత దీపారాధనలు బుధవారం జరిగాయి. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో దీపారాధనలు జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెన్షన్ పెంపు.. ఆనందం రెట్టింపు

రాష్ట్రంలో 80 ఏళ్లు పైబడిన వయోవృద్ధులు, 80 శాతం అంత కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు పెన్షన్ పెంపు రూ.3,500గా చేపట్టిన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీ బుధవారం కెంజొహర్ జిల్లాలో ప్రారంభించారు. దీంతో వృద్ధుల్లో ఆనందం వెల్లివిరిసింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: కెంజొహర్ జిల్లాలో పింఛన్ పెంపును ప్రారంభించిన సీఎం మోహన్‌చరణ్ మాఝి



రాయగడ: పెన్షన్ అందిస్తున్న కలెక్టర్ ఫర్హ్వారి. పక్కనే శివపట్నాయక్ తదితరులు



పర్లాకిమిడి: లబ్ధిదారుకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



పర్లాకిమిడి: 80 శాతం దివ్యాంగునికి పెంచిన భృతిని అందజేస్తున్న కలెక్టర్ విజయకుమార్ దాస్



జయపురం: లబ్ధిదారులకు పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



మల్కన్‌గిరి: వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్

రైతుల వద్దే ధాన్యం



సూర్యనారాయణ పట్నాయక్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో జనవరి 7 నుంచి ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలు (మండీలు) తెరిచారు. ఇప్పటివరకు గుసాని సమితిలో 24 సొసైటీల్లో (ప్యాక్స్) ఖరీఫ్ పంటను కొనుగోళ్లు చేయకపోవడంతో పండగ నాడు రైతులు ఇబ్బంది పడుతున్నారని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ పట్నాయక్ తెలిపారు. కొంతమంది రైతులు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకుంటున్నారని అన్నారు. ప్రస్తుతం రైతులు వద్ద డబ్బులు లేవన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పండగ తర్వాత అన్ని సొసైటీల్లో ధాన్యం కొనుగోళ్లు చేస్తామని అంటున్నారని అన్నారు. మరోవైపు మండీలలో ధాన్యం అమ్మకాలకు జారీ చేసిన టోకెన్ల గడువు ముగియడంతో వీటిని రెన్యువల్ చేయాలని రైతులు కోరుతున్నారన్నారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయకుంటే పండగ తరువాత పెద్ద ఎత్తున రైతులతో కలిసి కలెక్టరేట్ వద్ద ఆందోళన జరుపుతామన్నారు.

శ్రీమందిరంలో విషాదం



జగన్నాథ్(ఫైల్)

భువనేశ్వర్: పూరీ జగన్నాథుడు కొలువు దీరిన శ్రీమందిరంలో బుధవారం విషాదం చోటుచేసుకుంది. స్వామి సేవ చేస్తుండగా సేవకుడు అకస్మాతుగా కుప్పకూలాడు. వెంటనే తోటి సేవకులు జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు పూరీ మట్టి మండప సాహిలో ఉంటున్న సువార్ బొడు వర్గం సేవకుడు జగన్నాథ్ మేకప్‌గా గుర్తించారు. ఈయన రెండేళ్లుగా హృద్రోగ సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ శంకర స్వంయి, పోలీసు సూపరింటెండెంట్ వినీత్ అగర్వాల్, ఇతర ఉన్నతాధికారులు జిల్లా ప్రధాన ఆస్పత్రి సందర్శించి సేవాయత్ హఠాన్మరణం పట్ల సంతాపం ప్రకటించారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిశీలన



కాయకల్ప ప్రతినిధులతో హాస్పిటల్ సిబ్బంది

జయపురం: జయపురం సబ్ డివిజన్ కొట్‌పాడ్ కమ్యూనిటీ వైద్య కేంద్రాన్ని బుధవారం కాయకల్ప ప్రతినిధుల బృందం సందర్శించింది. రాష్ట్ర కాయకల్ప అధికారి డాక్టర్ ప్రభాకర సాహు, సుదాంశు శేఖర సామంత్, కన్సల్‌టెంట్ పీటీసీ అధికారి హాస్పిటల్‌లోని ఓపీడీ, డీడీసీ, పార్కింగ్, రోగి నమోదు కేంద్రంతో పాటు పలు విభాలు సందర్శించారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ సారథి ప్రసాద్ మునితో హాస్పిటల్ పరిస్థితులు, సమస్యలపైన చర్చించారు. ఈ చర్చల్లో జిల్లా కేంద్ర హాస్పిటల్ డాక్టర్ అభిలాస్ కుమార్, క్వాలిటీ మేనేజర్ పూర్ణ చంద్ర బొయి, వైద్యాధికారి రంజిత్ కుమార్ దాస్, డాక్టర్ శ్రీరామ పండా, సయిన మిశ్ర, అలిశ పరిబిని, ఫార్మసిస్టు సూర్యకాంత పాడీ, సంతోష్ కుమార్ పాడీ, బీపీఎం సమీర్ కుమార్ త్రిపాఠీ, హరిష్ చంద్ర ప్రదాన్, నరశింగ సాహు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో..



మండలంలోని మెట్టవలసలో మల్లికార్జున స్వామి యాత్రా మహోత్సవాలు సంక్రాంతి నాడు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భారీగా జనం తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్రామపెద్దలు ఏర్పాట్లు చేశారు.

–జి.సిగడాం

గంగమ్మ తల్లికి పూజలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురంలో సంక్రాంతి సందర్భంగా గంగమ్మ తల్లికి మంగళ, బుధవారాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలు మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏటా గ్రామంలో సంక్రాంతికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- క్రీడల ప్రగతికి సంబాద్ గ్రూప్ ఇస్తున్న చేయూత ప్రశంసనీయం
- జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు



వివిధ పోటీల్లో విజేతలు

జయపురం: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ఆదివాసీల అభ్యున్నతికి, కొరాపుట్ జిల్లా క్రీడల ప్రగతికి సంబాద్ గ్రూప్ ఇస్తున్న చేయూత ప్రశంసనీయని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. జయపురం యువత ఈ పోటీల్లో చూపిన ప్రతిభ ఔత్సాహిక క్రీడాకారులను స్ఫూర్తినిస్తుందని ప్రశంసించారు. మంగళవారం రాత్రి సంబాద్ గ్రూప్ ఆధ్వర్యంలో స్థానిక ఆదర్శనగర్ డీపీ అకాడమీ మైదానంలో ఒలింపిక్ లైట్ సెటిల్ బ్యాడ్మింటన్ 3.0 ఫైనల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ పోటీలలో పురుష యుగల్ గ్రూప్‌లో సిద్ధాంత నామక్, డి.మణకంఠ విజయం సాధించారు. కార్పొరేట్ గ్రూప్‌లో ఉమాశంకర ప్రధాన్, రశ్మీరంజన్ పండా, జంబల్ గ్రూప్ బ్యాచ్‌లో సిద్ధార్థ నాయక్, తిరుపతీ పాణిగ్రహి గెలిపొందారు. సీనియర్ కార్పొరేటర్లలో సునిల్ పాత్ర, సంగ్రామ మల్లిక్ విజయ కేతనం ఎగురవేయగా, సీనియర్ జంబల్ గ్రూప్‌లో ఎస్.మునీర్, ఆశిత్ పట్నాయక్ విజయం సాధించారు. బహుమతులను ఎమ్మెల్యే బాహిణీపతి, గౌరవ అతిథి డీపీ అకాడమి వ్యవస్థాపకులు త్రినాథ్ దాస్, దేవదత్త దాస్, సంబాద్ గ్రూప్ ప్రతినిధి నవీన చంద్ర సాహు అందించారు. ఈ పోటీల నిర్వహణకు రశ్మీరంజన్ సాగర్(సాయిరాం ఏజెన్సీ), ఎస్.చైతన్య అండ్ జగదీష్ , అలోక్ అగర్వాల్ (హల్లో జయపూర్), జి.బసంత రావు (కోమల్ ఎంటర్ ప్రైజెస్), అనికేత్ పట్నాయక్(నారాయణి కళాశాల) సహకరించారని నిర్వాహకులు వెల్లడించారు.

తగ్గిన మొసళ్ల సంతతి

- సతొకొసియా తీరంలో లెక్కింపు



మొసలి

భువనేశ్వర్: మొసళ్ల సంతతి వృద్ధి, సంరక్షణ కార్యకలాపాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వీటి సంతతి తగ్గినట్లు తాజా లెక్కింపు నివేదిక వెల్లడించడం ఆందోళన కలిగిస్తోంది. బౌధ్ జిల్లా మహా నది సతొకొసియా తీరంలో మొసళ్ల లెక్కింపు ఇటీవల ముగిసింది. సతొకొసియా వన్యప్రాణుల విభాగం ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. ఈ తీరంలో రెండు రకాల మొసలి జాతుల్లో 19 మాత్రమే కనుగొనబడినట్లు వెల్లడించారు. ఇది ఆందోళన కలిగించే పరిస్థితిగా అనుబంధ వర్గాలు పేర్కొన్నాయి. మెరుగైన పరిరక్షణ ప్రయత్నాలు అనివార్యమని నివేదిక హెచ్చరిస్తున్నట్లు ఈ వర్గం అభిప్రాయపడింది. సతొకొసియా అటవీ శాఖ వన్య ప్రాణుల విభాగంలోని మహానది వెంబడి, బౌద్ జిల్లాలోని కుసంగా పరిధిలో నిర్వహించిన మొసళ్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. తాజా లెక్కింపులో ఈ ప్రాంతంలో 2 జాతులలో గుర్తించిన 19 మొసళ్లలో 5 పెద్ద, 3 పిల్ల మొసళ్లు ఉన్నట్లు వెల్లడించారు.

గత ఏడాది 35 మొసళ్లు జననం..

గత ఏడాది ఈ తీరంలో 35 మొసళ్లు జన్మించాయి. ఈ పరిస్థితుల్లో ఇక్కడ వీటి సంతతి కనుమరుగు కావడం కలవరపరుస్తోంది. ఈ నేపథ్యంలో అటవీశాఖ అప్రమత్తం కావలసి ఉందని అనుభవజ్ఞులు సూచించారు. ఆధునిక పడవలు, కెమెరాలు, బైనాక్యులర్‌ల వంటి అత్యాధునిక పరికరాలతో లెక్కింపును పకడ్బందీగా నిర్వహించారు. తాజా గణాంకాల ప్రకారం సతొకొసియా తీరంలో సత్కోసియా ముఖ్యమైన మొసలి జాతుల వృద్ధి కోసం బలమైన పరిరక్షణ చర్యల అవసరమని భావిస్తున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలానికి ముందు మహా నది తీర ప్రాంతాల్లో మొసలి పిల్లలు సాధారణంగా కనువిప్పుతుంటాయి. వర్షాలు కురియడంతో తగిన పరిరక్షణ, సంరక్షణ చర్యలు అందుబాటులో లేకపోవడంతో వర్షపు నీటి ప్రవాహంతో ఇక్కడి మొసళ్ల సంతతి ఇతర తీర ప్రాంతాలకు కొట్టుకుపోతున్నట్లు స్థానికులు, ప్రాంతీయ అనుభవజ్ఞుల సమాచారం. ఈ విపత్తుకు అడ్డుకట్ట వేసి సతొకొసియా తీరంలో అపురూప మొసళ్ల సంతతి వృద్ధి పుంజుకుంటుందని తెలిపారు.

సతొకొసియా సంతానోత్పత్తి కేంద్రం

రాష్ట్రంలో మహా నది తీరం బౌధ్ జిల్లా సతొకొసియా తీరం 2021 ఘరియల్ జాతి మొసళ్ల సంతానోత్పత్తి కేంద్రంగా గుర్తించబడింది. ప్రకృతి సహజ పర్యావరణంలో పిల్లల్ని పొదిగే ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోంది.

ముందస్తు జాగ్రత్తలు అవసరం..

ఈ తీరంలో తగిన ముందస్తు జాగ్రత్తలు లేకపోవడంతో, మొసళ్ల సంతతి పెంపు కార్యక్రమం నీరు గారిపోతోంది. సతొకొసియా వన్యప్రాణుల విభాగం పరిధిలోని మహానది నది సునాఖొజియా ఘాట్‌లో 12 ఘరియల్ జాతి మొసళ్లు పొదిగిన పిల్లలను గత ఏడాది నవంబర్ 24న వాటి సహజ నివాస స్థలంలోకి విడుదల చేశారు. వీటి ప్రాథమిక సంరక్షణ కోసం నీటిలో కొట్టుకుపోకుండా ఈ పొదిగిన పిల్లలను తాత్కాలికంగా గత ఏడాది జులై నుంచి కృత్రిమ చెరువులో సంరక్షించారు. ఆ తర్వాత ప్రధాన నదీ స్రవంతిలోకి విడుదల చేశారు. తదుపరి సరంక్షణ చర్యలు డీలా పడడంతో ఈ పిల్లలు కనబడకుండా కనుమరుగుయ్యాయి. మహా నది నీటి మట్టం తగ్గిన తర్వాత, నిపుణుల పర్యవేక్షణలో మొసళ్లని తిరిగి అడవిలోకి వదిలారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు



గోదాదేవి, రంగనాథ స్వామి అలంకరణలో చిన్నారులు



జాజ్‌పూర్ ఉత్తరాది వైభవ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోదా దేవి కల్యాణోత్సవం

భువనేశ్వర్ స్థానిక ప్రవాసాంధ్రులు సమైక్యంగా మకర సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. సంప్రదాయ, ఆధ్యాత్మిక, మనోరంజక కార్యక్రమాలతో ఆబాల గోపాలం ఆనందోత్సాహాల్లో తేలియాడారు. భోగి మొదలుకొని కనుమ వరకు ఈ వేడుకలు కనుల పండువుగా నిర్వహించారు. భోగి మంట, భోగీ పళ్లు, పసుపు కుంకుమలు, ముగ్గుల అలంకరణ, గోదా కల్యాణం, లఘు నాటికలు మనోరంజక కార్యక్రమాలతో ఉర్రూతలూగించారు. మూడు రోజుల సంక్రాంతి సంబరాలు బుధవారం సాయంత్రంతో వైభవంగా ముగిశాయి. – భువనేశ్వర్



ఏసీఏ సంక్రాంతి సాంస్కృతిక కార్యక్రమాల్లో ముష్టి మహాసభ నాటికలో ఓ దృశ్యం



ఏసీఏ మహిళా సభ్యుల మమ్మీస్ బర్త్ డే నాటిక ప్రదర్శన

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడి కృతజ్ఞతలు



మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ జిల్లా అధ్యక్షుడిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న సంగిరెడ్డి శరత్‌బాబు

కొమరాడ: వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా యూత్ అధ్యక్షుడిగా ఎంపిక చేయడం పట్ల కొమరాడ వైస్‌ఎంపీపీ సంగిరెడ్డి శరత్‌బాబు మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, జిల్లా పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు చినమేరంగిలోని పార్టీ కార్యాలయం వద్ద బుధవారం వారిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం సూచనల మేరకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలియజేశారు.

చిల్లర దుకాణం దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సీతంపేట: స్థానికంగా వారపు సంత వద్ద గొర్లె ప్రకాశరావు నిర్వహిస్తున్న చిల్లర దుకాణం సోమవారం రాత్రి అగ్నికి ఆహుతైంది. దుకాణంలో ఉన్న గ్రైండర్, ఫ్రిడ్జి, గ్యాస్ స్టౌ, పరుపు, ద్విచక్రవాహనంతో పాటు, రూ.30 వేల నగదు, పలు చిన్నచిన్న వస్తువులు అగ్నికి ఆహుతి కాగా దాదాపు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు ప్రకాశరావు వాపోయాడు. సమాచారం మేరకు పాలకొండ అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

సంక్రాంతి సంబరాల్లో హైకోర్టు జడ్జి



భైరిపురంలో భక్తులకు వడ్డిస్తున్న హైకోర్టు జడ్జి చీమలపాటి రవి

మెరకముడిదాం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి చీమలపాటిరవికుమార్ ఆయన సొంత గ్రామం భైరిపురంలో గ్రామస్తులు నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. మంగళవారం ఆయన తన కుటుంబసభ్యులతో కలిసి అమరావతి నుంచి నేరుగా భైరిపురం గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులను పలకరిస్తూ అందరి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పలువురు పేదలకు దుస్తు లను పంపిణీ చేశారు. అలాగే మేలుకొలుపు బృందం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గదేని అయన పలువురు భక్తులకు స్వయంగా వడ్డించారు. తన సొంతగ్రామానికి సంక్రాంతి సందర్భంగా వచ్చిన ఆయనను పలువురు గ్రామపెద్దలు దుశ్శాలువాలతో సన్మానించారు. సాయంత్రం వరకూ గ్రామంలో తన సొంత ఇంటివద్ద గడిపిన జడ్జి ఆయన కుటుంబసభ్యులు సాయంత్రం విశాఖపట్నానికి బయల్దేరి వెళ్లిపోయారు.

రూ 25 కోట్ల మద్యం అమ్మకాలు

విజయనగరం క్రైమ్: జిల్లాలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా సుమారు రూ.25 కోట్ల మద్యాన్ని మందుబాబులు తాగేశారు. జిల్లా కేంద్రంలోనే రూ.మూడున్నర కోట్లకు పైగా వ్యాపారం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. అనధికార బెల్ట్‌షాపులపై దాడులు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ముక్కనుమను పురస్కరించుకుని మద్యం వ్యాపారం మరింతగా పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

జూట్ యాజమాన్యం బోనస్ వెంటనే చెల్లించాలి

నెల్లిమర్ల: జూట్‌మిల్ యాజమాన్యం బోనస్ వెంటనే చెల్లించాలని జూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జూట్‌యాజమాన్యం 2023వ సంవత్సరానికి సంబంధించిన బోనస్ ఈనెల 8న చెల్లిస్తానని చెప్పి మాట తప్పి ఇంతవరకు బోనస్ ఇవ్వలేదన్నారు. అలాగే యాజమాన్యం తన బినామీల ద్వారా బోనస్ చెల్లించడానికి ఏర్పాట్లు చేసినట్లు సమాచారం వచ్చిందని అయినా సరే ఇంతవరకు బోనస్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించడం భావ్యంకాదన్నారు. క్రిస్టియన్ సోదరులకు గతనెల బోనస్ చెల్లించారని, మిగతా కార్మికులకు ఇంతవరకు బోనస్ చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. కాబట్టి స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, లేబర్ అధికారులు స్పందించి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాకాని పక్షంలో లేబర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విజయాల వీరుడు..నాయుడు

- 25ఏళ్ల నుంచి ఎడ్ల పరుగుపోటీల్లో సత్తా
- ఎడ్లకు రోజువారీ మేత ఖర్చు రూ.రెండువేలు
- ప్రతిరోజూ చెరువులో ఈత కొట్టించడం, పరుగు తీయించడం



శానాపతి అప్పల స్వామి ఉరఫ్ నాయుడు



ఎడ్లతో పరుగు తీయిస్తున్న నాయుడు

వేపాడ: సంక్రాంతి పండగ వచ్చిందంటే..గ్రామాల్లో ఎడ్ల పరుగు ప్రదర్శనకు తెరలేస్తుంది. ఉత్సాహంగా ఉల్లాసంగా ఎడ్లు పరుగు తీస్తూ ఉంటే జనాల్లో ఒకటే కేరింత. ఆనందంతో తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తారు. వేపాడ మండలం, వల్లంపూడి గ్రామానికి చెందిన శానాపతి అప్పలస్వామి ఉరఫ్ నాయుడు వ్యవసాయం చేస్తూనే పందెం ఎడ్లు పెంచడంలో మమేకమై గత 25 ఏళ్లుగా విజయాలు అందుకుంటున్నాడు. నాయుడు మరో అడుగు ముందేకేసి ఈ ఏడాది మరో ఎద్దును కొనుగోలు చేశాడు. ప్రస్తుతం అతని దగ్గర ఉన్న మూడు ఎడ్లు సుమారు రూ.5లక్షల విలువ ఉంటాయి. వాటికి రోజుకు మేతకు రెండువేల రూపాయలు ఖర్చు చేస్తాడు. ఉలవలు, నువ్వుల ఉండలు లాంటి పలు పోషకాహారం కలిగిన పదార్థాలను మేతగా పెడుతు ఉంటాడు. ఉదయాన్నే రహదారిలో పరుగు తీయించడం, చెరువుల్లో ఈత కొట్టించడం వంటి ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ఎడ్లను మేపుతున్నాడు. గత 25 ఏళ్లుగా పోటీల్లో పాల్గొంటూ ఇప్పటివరకు నగదు, షీల్డ్, రజతం, బంగారం లాంటి పతకాలు సుమారు 450కి పైగా అందుకున్నాడు.

నాయుడు సాధించిన విజయాల్లో కొన్ని..

ఉమ్మడి విశాఖ జిల్లా చుక్కపల్లిలో 2020 డిసెంబర్ 12న నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మాజీ మంత్రి బూడి ముత్యాలు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రూ.పదివేలు, షీల్డ్‌ను అందుకున్నాడు.

- 2021 జనవరి16న కేఆర్‌పేటలో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానం
- సాధించి రూ.పన్నెండువేల నగదు అందుకున్నాడు.
- 2021 జనవరి 25 చుక్కపల్లిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి షీల్డ్, నగదు సాధించాడు.
- 2000లో ఎడ్ల పరుగు ప్రస్థానం ప్రారంభించిన ఏడాదే 15 బహుమతులు సాధించాడు. నాటినుంచి నాయుడు ఎడ్ల పరుగు ప్రదర్శనలో తిరుగులేకుండా ప్రతి ఏటా పోటీల్లో పాల్గొనడం ఏదో ఒక బహుమతి సాధించడంతో నేటికి సుమారు 450పైగా బహుతులు నగదు సాధించారు.

ఎడ్ల పరుగు అంటే ఇష్టం

చిన్నతనం నుంచి ఎడ్ల పరుగు అంటే ఇష్టం. దీంతో వ్యవసాయం చేస్తూ ఎడ్ల పెంపకంపై శ్రద్ధ చూపుతున్నాను. ప్రతి ఏటా విజయాలు అందుకోవడంతో మరింత ఆనందం పట్టుదలతో ఎడ్లను పెంచి పోషిస్తూ గ్రామాల్లో నాయుడి ఎడ్లు అనిపించుకున్నాను. రూ.ఐదు లక్షలతో ఎడ్లు కొనుగోలు చేసి ప్రతిరోజు రెండువేల రూపాయలు మేతకు ఖర్చుచేస్తూ ఉంటాను. ఎడ్లు ఆలనాపాలన నాతోపాటు నాకుమారుడు అప్పలరాజు, బావ ఏడువాక సత్తిబాబు సహకారంతో ఎడ్ల పోషణ సులభంగా చేస్తున్నాను. ఈ ఏడాది ఎడ్ల పరుగు ప్రదర్శనకు సిద్ధమయ్యాను.

శానాపతి అప్పలస్వామి(ఎడ్లునాయుడు)వల్లంపూడి, వేపాడ మండలం



తీర్థమహోత్సవంలో పరుగు తీస్తున్న నాయుడు ఎడ్లు (ఫైల్)



2021లో అప్పటి ఎమ్మెల్యే బూడిముత్యాలునాయుడుచేతులుమీదుగా షీల్డ్, నగదు అందుకుంటున్న నాయుడు



పరుగు ప్రదర్శనకు సిద్ధం చేసిన ఎడ్లు

అల్లుడిపై అరిటాకు అంత ఆప్యాయత





భోజనాలకు సిద్ధమైన జంటలు

- 108రకాలు వంటలు చేసి పెట్టిన అత్తవారు

మక్కువ: కొత్త అల్లుళ్లను సంక్రాంతి పండగకు పిలుపుచేసి, అల్లుడికి మర్యాద చేయాలనే ఉద్దేశంతో మంచి కానుకలు ఇవ్వడంతో పాటు, వంటలను పెట్టేందుకు అత్తవారు తహతహలాడుతుంటారు. అదే తరహాలో మక్కువకు చెందిన వారణాసి పకీరురాజు, వారణాసి గోవిందరాజు కుటుంబీకులు సంక్రాంతి పండగకు వచ్చిన అల్లుళ్లకు 108 రకాల వంటలు వండి భోజనాలు వడ్డించారు. అరిటాకు మొత్తం వంటకాలతో నిండిపోయింది. ఇన్ని రకాల వంటకాలను చూసిన అల్లుళ్ల మంత్రముగ్ధులయ్యారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైన 'విఘ్నేష్'

- అండర్-14 జట్టులో స్థానం

తెర్లాం: రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు తెర్లాం మండలం ఎస్.బూర్జవలస గ్రామానికి చెందిన పైల విఘ్నేష్ ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) ఒక ప్రకటన విడుదల చేసింది. అండర్-14 క్రికెట్ జట్టులో మొత్తం 18మంది క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయగా అందులో విఘ్నేష్ స్థానం సంపాదించడం విశేషం. మండలంలోని ఎస్.బూర్జవలస గ్రామసర్పంచ్ ప్రతినిధి పైల గణపతి కుమారుడు విఘ్నేష్. విఘ్నేష్‌కు చిన్నతనం నుంచి క్రికెట్‌పై ఉన్న మక్కువతో అతనికి క్రికెట్ ఆటలో తర్ఫీదునిచ్చారు. ఇప్పటికే పలుమార్లు వివిధ కేటగిరీల్లో క్రికెట్ పోటీల్లో పాల్గొన్న విఘ్నేష్ బాగా రాణించాడు. అండర్-14 రాష్ట్ర జట్టు ఎంపికకు నిర్వహించిన సెలక్షన్‌లో కూడా విఘ్నేష్ మంచి ప్రతిభ కనబరచడంతో సెలక్టర్లు రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విఘ్నేష్‌ను తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు, మండలంలోని ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

ఆనందంగా ఉంది



రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. విజయనగరం జిల్లా నుంచి నేను ఒక్కడినే ఈ జట్టులో ఎంపికయ్యాను. చిన్నతనం నుంచి క్రికెట్‌పై ఉన్న మక్కువతో ఆట నేర్చుకున్నాను. క్రికెట్ ఆటలో నా తల్లిదండ్రులు నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. క్రికెట్‌లో నాకు మెలకువలు నేర్పించిన నా కోచ్‌కు, తోటి క్రీడాకారులకు కృతజ్ఞతలు.

పైల విఘ్నేష్, క్రికెట్ క్రీడాకారుడు, ఎస్.బూర్జవలస, తెర్లాం మండలం

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని మంగళ, బుధవారాల్లో పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమా చక్రవర్తి కుటుంబసమేతంగా ఆదిత్యున్ని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు చేయించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సిబ్బంది గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు జ్ఞాపిక అందజేశారు. అదే విధంగా, విలక్షణ సినీ నటుడు సాయికుమార్, జబర్దస్త్ హాస్య నటుల బృందం అప్పారావు తదితరులు కూడా ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

వైభవంగా కర్పూరజ్యోతి దర్శనాలు



బలగలో అయ్యప్పస్వామికి కర్పూర హారతి ఇస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా శబరిమలలో మకర జ్యోతి దర్శన సమయంలో బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో కర్పూర జ్యోతి దర్శనాలు ఏర్పాటు చేశారు. బలగ అయ్యప్ప స్వామి ఆలయంలో కర్పూర జ్యోతిని వెలిగించారు. అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ ఆధ్వర్యంలో మణికంఠుని ఉత్సవమూర్తిని పల్లకిలో ఉంచి ఆలయ పరిసరాలలో తిరువీధి నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన కర్పూరాలను భక్తులకు అందచేయగా, వాటిని ఆలయ ఆవరణలోని బానలో వేయగా.. పెద్దమంటలా ఏర్పడి మకరజ్యోతిని తలపించింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అయ్యప్పస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సువర్ణ మణిమయ మకుటాభరణాలతో స్వామి వారి దివ్యాలంకరణ వైభవాన్ని భక్తులు కనులారా వీక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రెడ్డి చిరంజీవులు, కార్యదర్శి దానేటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప శిఖర జ్యోతి దర్శనాలు..

పాతశ్రీకాకుళంలోని అయ్యప్పదేవాలయంలో కర్పూర జ్యోతి శిఖర దర్శనాలు, స్వామికి పడి పూజలు చేశారు. అర్చకులు బాలు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఎల్.నందికేశ్వరరావు పర్యవేక్షణలో 18 మెట్లపై కర్పూర జ్యోతులను వెలిగించారు. ఆలయ శిఖరంపైనా కర్పూర జ్యోతిని వెలిగించి భక్తులకు జ్యోతి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం స్వామివారికి అష్టోత్తర శతనామాలతో పుష్పాభిషేకం నిర్వహించారు.

పీఎంఈజీపీతో ఉపాధి అవకాశాలు

పార్వతీపురం: ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ)తో స్వయం ఉపాధి అవకాశాలున్నాయని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంఈజీపీ వివిధ రంగాలలో స్వయం ఉపాధి కల్పనకు రుణాలు అందిస్తుందన్నారు. తయారీ రంగ కార్యకలాపాలకు రూ.50లక్షలు, సేవా రంగ విభాగానికి రూ.20లక్షల వరకు బ్యాంకు రుణం లభిస్తుందని పేర్కొన్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం వరకు ప్రభుత్వం సబ్సిడీ ఉంటుందని, లబ్ధిదారుని వాటా 5 నుంచి 10శాతం వరకు ఉంటుందన్నారు. 18 ఏళ్లు కలిగిన యువత ఈ పథకాలను పొందేందుకు అర్హులని తెలిపారు. వ్యక్తిగత ఆదాయ పరిమితి లేదని, రూ.10లక్షలు పైబడిన తయారీ రంగ పరిశ్రమలకు, రూ.5లక్షలు పైబడిన సేవా రంగ పరిశ్రమలకు వర్తిస్తుందన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కేవీఐసీఓఎన్‌లైన్.ఓఓవీ.ఇన్/పీఎంఈజీపీ ఈ పోర్టల్ వెబ్‌సైట్‌లో చదవచ్చని వివరించారు.

ముగిసిన సూపర్ సిక్స్ క్రికెట్ టోర్నమెంట్



ద్వితీయ స్థానంలో నిలిచిన రన్ మిషన్ జట్టుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

చీపురుపల్లి: పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం ఆవరణలో జరిగిన సూపర్ సిక్స్ క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. పట్టణానికి చెందిన రన్ మిషన్ సంస్థ ఆధ్వర్యంలో జనవరి 9న ప్రారంభమైన సూపర్ సిక్స్ క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 13న భోగి రోజు రాత్రి ముగిసింది. ఫ్లడ్ లైట్లు వెలుతురులో జరిగిన ఈ టోర్నమెంట్‌లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 60 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విశాఖపట్నం జట్టుకు రూ.30 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన రన్ మిషన్ జట్టుకు రూ.20 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన లావేరు రోడ్ జట్టుకు రూ.10 వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన వినయ్ సిక్సర్స్ జట్టుకు రూ.5 వేలు నగదు బహుమతి అందజేశారు.

పండగ విషాదం..
వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

- బైక్‌ను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్
- ప్రమాద స్థలంలోనే ఇద్దరు యువకుల మృతి
- వంద అడుగుల వరకు బైక్‌ను ఈడ్చుకు వెళ్లిన ట్యాంకర్



లవణ్ కుమార్ మృతదేహం



రంజన్ దాస్ మృతదేహం

బొండపల్లి: సంక్రాంతి పండగ వేళ వేగంగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఓ బైక్‌ను ఢీకొట్టడంతో రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయి ఆ కుటుంబాల్లో తీవ్రవిషాదం నెలకొంది. మంగళవారం వేకువ జామున చోటు జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై యు.మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బొండపల్లి పంచాయతీ పరిధి మధుర చందకపేట గ్రామానికి చెందిన వెలుగుల లవణ్‌కుమార్(25)తో పాటు ఒడిశాకు చెందిన రశ్మీన్ రంజన్‌దాస్(25)లు గొట్లాం వద్ద గల బైపాస్ రోడ్డు నుంచి బైక్‌పై వెళ్తుండగా అదే రోడ్డుపై వేగంగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టి సుమారు వంద అడుగుల దూరం వరకు బైక్‌ను ఈడ్చుకుని వెళ్లడంతో ట్యాంకర్ కింద పడిన ఇద్దరు తీవ్ర గాయాల పాలై అక్కడిక్కడే మృతిచెందారు. మృతులిద్దరూ గజపతినగరంలోని రిలయన్స్ ట్రెండ్స్ బట్టల దుకాణంలో కొద్ది రోజులుగా పని చేస్తున్నారు. ఆ రాత్రి సమయంలో ఆటు వైపు ఎందుకు వెళ్లారో వివరాలు తెలియ రాలేదు.

లవణ్ కుటుంబంలో తీవ్ర విషాదం

వెలుగుల లవణ్ కుమార్‌కు ఏడాదిన్నర క్రితం చైతన్య లక్ష్మితో వివాహం అయ్యింది. వారికి నాలుగు నెలల కిందట బాబు పుట్టగా ఈనెల 20 వతేదీన వైభవంగా బారసాల వేడుకను కుటుంబసభ్యులు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తీరా కుటుంబసభ్యులందరూ ఆనందంగా ఉన్న సమయంలో, సంక్రాంతి పండగ వేళ ఇటువంటి దురదృష్టకర సంఘటన సంభవించడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని మహారాజా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..




వాసు (ఫైల్)

గంట్యాడ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలంలోని రామవరం వద్ద ఈనెల 13తేదీన ఆటో, బైక్ ఢీకొన్న సంఘటనలో రామవరం గ్రామానికి చెందిన పి.వాసు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామంలో స్నానాలు చేయడానికి కర్రలతో నీరువేడి చేస్తున్న సమయంలో చీరకు నిప్పంటుకుని గాయాలపాలైన మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బూర్జగ్రామానికి చెందిన అల్లు విజయలక్ష్మి ఈనెల 10 ఉదయం 8.30 గంటల సమయంలో స్నానానికి వంటకలపతో నీళ్లు కాచేందుకు మంట పెట్టింది. మంటపెట్టి వేరే పని చూస్తుండగా ఆమె కట్టుకున్న పాలిస్టర్ చీరకు మంట తగలడంతో శరీరంపై గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని పార్వతీపురం జిల్లాకేంద్రాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందింది. మృతురాలి భర్త జగ్గునాయుడు ఫిర్యాదు మేరకు ఏఎస్సై లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సువర్ణముఖి నది గోతిలో పడి యువకుడు..



అనుదీప్‌కుమార్ మృతదేహం

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది గోతిలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. పెదభోగిలి గ్రామానికి చెందిన సురగాల అనుదీప్(27)తన చెల్లి, బంధువులతో పాటు మంగళవారం మధ్యాహ్నం సువర్ణముఖి నదిపై ఉన్న ఆర్అండ్‌బీ బ్రిడ్జి సమీపంలో స్నానాలు చేశారు. అందరూ స్నానాలు చేసుకుని ఒడ్డుకు చేరిన సమయంలో ఇసుక తీసిన గోతిలో అనుదీప్ మునిగి పోవడంతో బయటకు రాలేకపోవడాన్ని గుర్తించిన చెల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్సై ఎం.రాజేష్ అనుదీప్‌ను బయటకు తీసి 108 వాహనంలో చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా అనుదీప్ మృతిచెందాడు. అనుదీప్‌కుమార్ కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై లక్ష్మణరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.


ఎడ్లు పరుగు ప్రదర్శనలో అపశ్రుతి



మృతిచెందిన నాయుడు

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన ఎడ్ల పరుగు ప్రదర్శనలో అపశ్రుతి దొర్లింది. దీనిపై వల్లంపూడి ఎస్సై బి.దేవి అందించిన వివరాలిలా ఉన్నాయి. పరుగు ప్రదర్శనలో ఎడ్లు అదుపుతప్పి జనాల్లోకి వెళ్లిపోయాయి. ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనలో ఆర్‌వైఅగ్రహారానికి చెందిన ఇండుగుబిల్లి సన్యాసిరావు ఉరఫ్ నాయుడు (45) అనే వ్యక్తి ఛాతీపై నుంచి బండి వెళ్లిపోవడంతో ఛాతీ నొప్పి వస్తోందని కె.కోటపాడు ఆస్పత్రిలో చూపించుకున్నారు. చికిత్సపొందుతూనే చనిపోయినట్లు ఆస్పత్రి నుంచి సమాచారం అందిందని ఎస్సై తెలిపారు. మృతి చెందిన నాయుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..



మృతిచెందిన ప్రకాశ్ రావు

గంట్యాడ: మండలంలోని రామవరం గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో మహిళ గాయపడింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా కంచరపాలెంకు చెందిన కె. ప్రకాశరావు (45), డెంకాడ మండల కేంద్రానికి చెందిన రాయవరపు చంద్రమ్మలు విజయనగరంలోని కలెక్టరేట్ ఆఫీస్ వద్ద ఆటో ఎక్కి గంట్యాడ వైపు వస్తున్నారు. రామవరం గ్రామ సమీపం వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఆటోలో వస్తున్న ప్రకాశరావు, చంద్రమ్మలకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 అంబులెన్సులో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రకాశరావు మృతి చెందాడు. చంద్రమ్మ చికిత్స పొందుతోంది. ప్రకాశ్ రావు బంధువుల ఫోన్ నంబర్ దొరకలేదని ఎస్సై సాయికృష్ణ తెలిపారు. అతని వివరాలు తెలిసిన వారు 9121109442కు తెలియజేయాలని కోరారు.

పండగ ఖర్చు రూ.120 కోట్లు

- గతేడాది కంటే రూ.30 కోట్లు తక్కువ
- మద్యం, మాంసం కొనుగోలుకే అధిక ఖర్చు



గంట్యాడ మండలం పెదవేమలిలో చేపలు విక్రయిస్తున్న మత్స్యకారులు

విజయనగరం ఫోర్ట్: సంక్రాంతి పండగకు జిల్లా ప్రజలు సుమారు రూ.120 కోట్లు వరకు ఖర్చుచేసినట్టు మార్కెట్ వర్గాల అంచనా. గతేడాది కంటే ఈ ఏడాది రూ.30 కోట్లు వరకు ఖర్చు తగ్గింది. మాంసం, చేపలు, మద్యం కొనుగోళ్లకే అధిక శాతం డబ్బులు వెచ్చించారు. వరుస తుఫాన్లతో రైతన్నలు పంటలు నష్టపోవడం, పిల్లల ఫీజుల భారం వంటివి పండగ సందడిలేకుండా చేశాయి. ప్రభుత్వం నుంచి మహిళలకు ఆర్థిక 'చేయూత' అందకపోవడంతో సంక్రాంతికి పొదుపుగా ఖర్చుచేశారు. కొందరు అప్పుచేసి పండగకు కావాల్సిన సామగ్రిని మాత్రమే సమకూర్చుకున్నారు. వస్త్ర, బంగారు వ్యాపారాలు గణనీయంగా తగ్గాయి.

17 నుంచి ఉరుసు ఉత్సవాలు

విజయనగరం టౌన్: స్థానిక కోట జంక్షన్ వద్ద నున్న డెంకెషావలీబాబా ఉరుసు మహోత్సవాలు ఈ నెల 17 నుంచి మూడురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు దర్గా వంశపారంపర్య సేవకులు ఖాదమ్ షేక్ బహదూర్ షేక్ షాజహాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో ఖురాన్ పఠనంతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం అంబటిసత్రం జంక్షన్ నుంచి బాబా సందల్ మహా ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. వేలాది మంది భక్తులకు అన్నసమారాధన ఉంటుందని, భక్తులందరూ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.